# మెట్రో ఈవినింగ్స్

Estd : 1998

2 PM

August 24,2026
Monday

Hyderabad

Vol:29, Issue:65


BREAKING EDITION



# తప్పించడమా..! వదిలేయడమా..!?



(మెట్రో న్యూస్ బ్యూరో): బతకడమా... చావడమా! వేటు వేయాలా... వదిలేయాలా! ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరిగ్గా ఇదే సమస్యను ఎదుర్కొం టున్నారు. ఇటీవల రాజకీయ పరిణామాలపై ఆయన వైఖరి ఏమిటి..? తదుపరి చర్యలు ఏమిటి..? అనేది ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో అసహనంగా ఉన్న రేవంత్... కొందరు కాంగ్రెస్ నాయకుల తీరుతో ఆగ్రహంతో ఉన్నారు. ఇక మంత్రి కొండా సురేఖ కుటుంబం ఆయన్ను టార్గెట్ చేయడం భరించలేకపోతున్నారు! సీఎంకు అనుకూలురైన ప్రజాప్రతినిధులు అందరూ సురేఖను డిస్మిస్ చేయాల్సిందేనని పట్టుబడుతుండగా, సీనియర్ మంత్రులంతా జరుగుతున్న పరిణామాలను మౌనంగా గమనిస్తున్నారు. ఇవన్నీ ఆగస్టు సంక్షోభం తాలూకు ప్రకంపనలేనా! ఈ విషయాన్ని మెట్రో ఈవినింగ్స్ దినపత్రిక ఇదివరకే చెప్పింది. నినిరాష్ట్రంలో విపక్షాలపై ఒకవైపు పోరాటం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌కు మరోవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచీ అసమ్మతి పోటు తీవ్రమవుతోంది. మంత్రి సురేఖ కుటుంబం సభ్యులు, ముఖ్యంగా కూతురు సుస్మితా పటేల్ వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌ను కుదిపేశాయి. నేరుగా సీఎంనే సుస్మిత లక్ష్యంగా చేసుకున్నారు. బిడ్డ తిడితే... తల్లి సురేఖకు పార్టీ క్రమశిక్షణ సంఘం నుంచి నోటీసులు వెళ్లాయి. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా ఈ వ్యవహారాన్ని తప్పుబట్టారు. కూతురు వ్యాఖ్యలతో తనకేం సంబంధం లేదంటూ... క్రమశిక్షణ సంఘానికి ఆమె లేఖలు రాయడమే కాకుండా.. నేరుగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోనే భేటీ అయ్యారు. సీఎం విదేశాల్లో ఉండగానే... హైకమాండ్‌ను కలిసి వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. మంత్రి సురేఖ ఫ్యామిలీ ధిక్కార స్వరంపై ముఖ్యమంత్రి గుర్రుగా ఉన్నారు. ఇపుడు కూడా చర్యలు తీసుకోకపోతే... అసమ్మతి తారాస్థాయికి చేరి, పార్టీలో గందరగోళానికి దారితీస్తుందని సీఎం అనుయాయులు అధిష్టానంపై ఒత్తిడి పెంచుతున్నారు. మంత్రివర్గం నుంచి ఆమెను తప్పిస్తేనే.. రేవంత్ రెడ్డి ఆధిపత్యం కొనసాగుతుందని రాజకీయ విశ్లేషకుల మా! లేదంటే... సీఎం బలహీనమవుతారు అనేది పొలిటికల్ కామెంట్! మరి ముఖ్యమంత్రి మాట హైకమాండ్ వింటుందా... మంత్రి సురేఖపై వేటు పడుతుందా అనేది చూడాలి. మొత్తానికి బంతి గాంధీల కోర్టులోకి వెళ్లింది. పార్టీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తారు అనేది ఆసక్తికరంగా మారింది.

**సీఎం రేవంత్ రెడ్డి ముందున్న సమస్య!**



మిస్ యూనివర్స్ ఇండియా 2026

## 19ఏళ్ల కేరళ యువతి కజియా

ఇంటర్నెట్ డెస్క్: కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' కిరీటం దక్కించుకుంది. జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి టైటిల్ సొంతం చేసుకుంది. మిస్ యూనివర్స్ ఇండియా 2025 విజేత మానికా విశ్వకర్మ ఆమెకు కిరీటం అలంకరించారు. దీంతో నవంబర్‌లో ప్యూర్టోరికోలో జరిగే 75వ మిస్ యూనివర్స్ పోటీలో భారత్ తరఫున కజియా ప్రాతినిధ్యం వహించనుంది. కిరీటం దక్కిన అనంతరం కజియా ఆనందం వ్యక్తం చేసింది. ఈ కిరీటం కోసం మూడేళ్లకు పైగా కష్టపడ్డానని తెలిపింది. తన సొంత రాష్ట్రం కేరళకు ఈ విజయాన్ని తీసుకెళ్లడం ఎంతో గర్వంగా ఉందని చెప్పింది.

## సీఎం తో భట్టి భేటీ

హైదరాబాద్ (మెట్రోన్యూస్): విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రా(ష్టానికి సంబంధించిన తాజా రాజకీయం, పాలనాపరమైన అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, రానున్న రోజుల్లో తీసుకోవాల్సిన కీలక నిర్ణయాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది.

## ఫీజు బకాయి.. బీజేపీ లడాయి




హైదరాబాద్ (మెట్రోన్యూస్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ 48గంటల దీక్ష చేపట్టింది ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 48 గంటల నిరాహార దీక్ష సోమవారం చేపట్టారు. ఫీజు బకాయి బీజేపీ లడాయి నినాదంతో ఈ ఆందోళన నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో సుమారు రూ. 12,000 కోట్ల నుంచి రూ. 15,000 కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు ఆరోపించారు.

బకాయిలు రాక పోవడంతో కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను ఆపుతున్నాయని, దీనివల్ల విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వం ప్రకటించిన రూ. 2,000 కోట్ల అడ్వాన్స్‌ను కూడా పూర్తిగా విడుదల చేయడంలో విఫలమైందని ఆయన మండి పడ్డారు.



## హైదరాబాద్‌కు సీఎం
## స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు


హైదరాబాద్ (మెట్రోన్యూస్): లండన్ పర్యటన ముగించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. సీఎం నగరానికి చేరుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



## అనుమతులు లేని భవనాలు కూల్చివేతకు ఆర్డర్స్

హైదరాబాద్ (మెట్రోన్యూస్): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతులు లేని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 75 చదరపు గజాల లోపు స్థలంలో 7 మీటర్ల ఎత్తు మించి నిర్మించిన భవనాలు, 75 గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో అసలు అనుమతులే లేకుండా చేపట్టిన నిర్మాణాలను వెంటనే కూల్చేయాలని టౌన్ ప్లానింగ్, ఎన్ఫోర్స్మెంట్ టీమ్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ రోజు నుంచే ప్రతిరోజూ కూల్చివేతలకు రంగం సిద్ధమవుతోంది.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ముగురు నవజాత శిశువుల సజీవదహనం



ముంబై: మహారాష్ట్ర లో దారుణం జరిగింది. అమరావతి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు శిశువులు మృతిచెందారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో అగ్నిప్రమాదం జరగడంతో..ఈ విషాదం చోటుచేసుకున్నది. జిల్లా మహిళా ఆస్పత్రిలో ఈ ఘటన జరిగింది. ఆస్పత్రి మూడవ అంతస్తులో ఉన్న ఎన్ఐసీయూ వెంటిలేటర్‌లో స్పార్క్ రావడంతో ఈ ప్రమాదం సంభవించింది. తెల్లవారుజామున 3.15 నిమిషాలకు ఈ ఘటన జరిగింది. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో.. డాక్టర్లు, నర్సర్లు, ఇతర సిబ్బంది.. ఎన్ఐసీయూలో ఉన్న శిశువులను రక్షించారు. కానీ ఆ ప్రమాదంలో ముగ్గురు శిశువులు ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. మరో ఆరు మంది శిశువులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు.

## కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ భేటీ

హైదరాబాద్ (మెట్రోన్యూస్): కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ హైదరాబాద్ జలసౌధలో భేటీ అయ్యింది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. తెలంగాణ ఈఎన్ సీ రమేశ్ బాబు, ఏపీ ఈఎన్ సీ నరసింహమూర్తి హాజరయ్యారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చిస్తున్నారు. పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకుగానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశ పర్చాలని ఏపీ.. కృష్ణా బోర్డుకు లేఖ రాయగా తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని నిర్ణయించారు.